దుర్గామందిరము

శ్రీమతి దేవులపల్లి జగదాంబగారు

౧

భామ యింట్లో వంటచేయుచుండెను. వ్రజనాథు "లా" పుస్తకము చదువుచుండెను. శ్యామ, మున్నా ఒకరితోనొకరు పోట్లాడుచుండిరి. "నాన్నా! నాబొమ్మ తీసుకొన్నది. చూడు" అన్నది శ్యామ. "అమ్మా! నామిఠాయి శ్యామ తినేసింది" అన్నది మున్నా. వ్రజనాథు విసుగుజెంది "భామా! వంటింట్లో అతుక్కుపోవడమేనా, పిల్లల్ని చూడు" అనెను. "నాచేతిలో పనివున్నది. మీరు వకమారు చదువుకట్టిపెట్టి పిల్లలను వోదార్చగూడదూ! యేం! నాకేగ్యారంటీ అనుకున్నారా! అన్నది భామ. వ్రజనాథు మారుమాటాడలేదు. కోపము అణచుకొనలేక దిగ్గునలేచి పుస్తకముమూసివైచి కాలేజీపార్కులోనికి వెళ్లిపోయెను.

౨

శ్రావణమాసము. సాయంకాలము. ఆకాశము నిర్మలముగా నుండెను. గ్రంథావలోకనముకంటె ప్రకృతావలోకనమే వ్రజనాథునకు ప్రీతిగానుండెను. కొంతసేపు ఆయన వినీలాకాశము వీక్షించుచుండెను. కొంతతడవు బంగారుచాయదాల్చిన వృక్షములను చూచుచుండెను; తరువాత విశాలమైనమైదానముపై ఆటలాడుకొను బాలురను గాంచుచుండెను. అంతట ఆపచ్చికబయలుపై ఒకకాగితపుపొట్లము కనబడెను. వెంటనే ఆపొట్లము యేమైయుండునో చూదమని మనసుబుట్టెను. తక్షణమే మనస్సాక్షి పొట్లము యేదైన నీకేమి? నీదికాదుగదా! అని సమర్థించెను. కాని మనసు మరల్చుకొనలేక లేచి, అచ్చటకుపోయి పొట్లము నుయెత్తి దానిలో నేమున్నదోయని విప్పిచూచెను. కన్నులు మెరసేటట్టు యెనిమిదిగిన్నీకాసులు! వెంటనే ఆశబాధించెను. అయినను తెలివితెచ్చుకొని, అయ్యో! యిది పరులధనముకదా! యెవరుపొరపాటున జారవిడిచిరో దీనినిమనము దాచకూడదని అంతరాత్మ బోధించెను. ఈపొట్లము మనము యిచ్చటవిడచిపోయిన ఎవరైనను తీసుకొని పోవుదురేమో! అందుచే దీనిని జాగ్రత్తపరచి పోలీసుఠాణాలో వప్పచెప్పిన బహుశా హక్కుదార్లకు అందవచ్చును అని నిశ్చయించెను. ఆగడియయందు చీకటిపడుటచే ఠాణాకువెళ్లలేక ఉదయము వెళ్లుటకు నిశ్చయించెను. ఇంటికి దారిబట్టెను. ఇంటికిపోయినపిమ్మట భామ తనపెనిమిటిజేబులోని పొట్లమువిప్పి, యెనిమిది గిన్నీకాసులుచూచి సంభ్రమముతో ఎవరివండీ? అనిప్రశ్నించెను. వ్రజనాథ్ నావి అని ఆమెచేతిలోనివి అందుకొనెను.

భామ:—హాస్యముమాని నిజముచెప్పండి.

వ్రజనాథ్:—తోవలో పొట్లముతో దొరికినవి.

భామ:—మీరు అబద్ధము చెప్పుచున్నారు. ఎక్కడదొరికేయి?

వ్రజనాథ్:—నిజముగానే చెప్పుచున్నాను. పార్కుదగ్గిర దొరికినవి.

భామ:—నాతోడు! అని పెనిమిటిచేతిలో కాసులులాగుకొనే ప్రయత్నముచేశినది.

వ్రజనాథ్:—చేతిలోనివి లాగుకుంటావేమి!

భామ:—యిచ్చేయండి. నాదగ్గిరవుంచుతాను.

వ్రజనాథ్:—కట్టిపెట్టు. పోలీసుఠాణాకుపోయి వీటివిషయమై రిపోర్టుచేశి దాఖలుచేయవలెను.

భామ:—(తెల్లబోయి) మనకు దొరికినధనమునకు రిపోర్టుయెందుకు?

వ్రజనాథ్:—వాహ్వా! ఈయెనిమిదికాసులకొరకు మర్యాద పాడుచేసుకోమనెదవా?

భామ:—సరే. అయితే ప్రొద్దునవెళ్లండి, యీరాత్రివేళ మీరువెళ్లిన, తిరిగి వచ్చేసరికి చాలాలేటుఅవుతుంది. నేను వంటరిగావుండలేను.

ప్రజనాధ్:—మంచిది. ప్రొద్దుటేవెళ్లెదను. పొట్లము జగ్రత్తగా ట్రంకుపెట్లోదాచుము అవితెచ్చి, భోజనము చేసి విశ్రమించిరి.

భామ:—చేతులారా దొరికినధనము రెండుకు వదిలేస్తారు. నాకు యిచ్చేయండి. చాలారోజులాయి వాచిచైయిను చేయించుకుందామని మనసుఉన్నది.

ప్రజనాధ్:—నీమెడలో ఛేయినుకొరకు నామెడలో వురితాడు వేసుకోమంటావా?

3

ఉదయముననే కాఫీతాగి పోలీసుఠాణాకుపోయే ప్రయత్నములో ప్రజనాధ్ బట్టలు వేసుకొనుచుండెను. అంతలో అతనిస్నేహితుడు, మున్షీగోరేలాల్ వచ్చి తన సంసారపుచిక్కులుచెప్ప మొదలుపెట్టెను. చివరకు తాను చాలాడబ్బు యిబ్బందిలోఉన్నాననియు యేలాగైనా, రు 30-లు సర్దుబాటుచేయక తప్పదని దీనముగా ప్రార్థించెను. ప్రజనాధ్ భాగ్యవంతుడు కానప్పటికి స్నేహముకొరకు, డాబుకొరకు తను యిబ్బందిపడైనా సర్దుతూవుండేవాడు. కాని నిర్మొగమాటముగా తను యివ్వనని తనవద్ద లేదని చెప్పలేకపోయేవాడు. అంతట భామవద్దకువెళ్లి “నీవద్ద ముప్పైరూపాయిలువుంటే యియ్యవలెను. మున్షీగోరేలాల్ అడుగుచున్నాడు” అనెను.

భామ:—నావద్ద రూపాయిలులేవు.

ప్రజనాధ్:—వుంటాయి నిశ్చయంగా, గమ్మత్ చేస్తూయున్నావు.

భామ:—గమ్మత్తే అనుకోండి!

ప్రజనాధ్:—అయితే అతనికి యేమనిచెప్పమంటావు?

భామ:—యింట్లో రూపాయలులేవని చెప్పండి. మీచేతకాకుంటే నేజెప్పెదను.

ప్రజనాధ్:—చేతకాకపోవడమేమి? నేను చెప్పగలనుగాని నమ్మడు.

భామ:—నమ్మకపోతే పోనీయండి. మనకేంబాధ?

ప్రజనాధ్:—రాత్రీపగలు స్నేహముగావుంటూ అంత నిర్మొగమాటముగా వుండలేను.

భామ:—సరే! మీకు యేలాగుతోచుతే ఆలాగుచెయ్యండి. నాకు తెలియదు. నాదగ్గిరలేవని చెప్పేను-లేవు.

ప్రజనాధ్చాలావిచారించి లేవనిచెప్పుటకు సిగ్గుపడి తనసందుకుపెట్టితీసి అందులోని రెండుగినీలు యిచ్చి “రేపుమళ్లీ నీవుతప్పకుండా యిచ్చివేయవలెను. లేనియడల నాఅబోరుదక్కదు”అనెను.

గోరేలాల్ అవి జేబులోవేసుకొని ‘ఎంతమాట! అవుసరంగడపేవు. రేపు సాయంకాలము కచేరినుండివస్తూ తోవలో నీసొమ్ము నీకుయిచ్చివేస్తాను” అనిలేచి తనయింటికి వెళ్లిపోయెను.

౪

ఆరోజు పస్తుతారీకు. ప్రజనాధ్ సాయంకాలము 5-ఘంటలుమొదలు వీధివైపు కళ్లుకట్టుకొనెను. చేతిలోవున్న వుత్తరము చదువుటకుకూడా తీరికలేక ప్రతి 5-నిముషములకు వీధిలోనికిదృష్టి సాగిస్తూయుండెను. అట్లాగాచూస్తూవుండగానే ఆరుకొట్టింది. విసుకుజెంది కాళ్లునొప్పియెత్తి కుర్చీతెచ్చుకొని వరండాలో గూర్చొని యెదురుచూచుచుండెను. 7-గంటలు వినబడెను. ఎక్కడా గోరేలాల్ పత్తాలేదు. కుర్చీనుండి లేచి వీధిలో గోడ్డుపైపచారు మొదలుపెట్టెను. దూరమునుండి యెవరో గోరేలాల్మాస్తరుగా టోపీపెట్టు

కొని వస్తూయుంటే కొండంతఆశపడి దగ్గరకు వచ్చినతర్వాత తెల్లబోయి వెనుకకు మరలిపోయెను. రాత్రి 9-గంటలవరకూ ఇట్లు వీక్షించెను. అంతట యింటిలోనికిపోయి మతిలేనివానివలె భోజనముచేసి దీర్ఘాలోచన మొదలుపెట్టెను. బహుశా గోరేలాల్ పరాకున మరొకదారిని ఇంటికి పోయియుండునని నిశ్చయించి వానియింటికిపోవుట బయలుదేరి అడుగులు లెక్కపెట్టుకొనుచు వీథిలోనుండి గోరేలాల్ యింటివైపుచూచెను. ఒకవేళ గోరేలాల్ తననుచూచి యింతరాత్రివేళ సొమ్ముకొరకువచ్చితి ననుకొనునేమో అని మొగమాటముపడి వెనుకకు పదిఅడుగులువైచి తిరిగి తనలో ధైర్యముతెచ్చుకొని, అయనను చూచుటకువచ్చితినని సొమ్ముకొరకుకాదని చెప్పవచ్చునని దృఢపర్చుకొని మళ్లీ గోరేలాల్ గుమ్మములోనికివెళ్లి మెల్లగా తొంగిచూచెను. గోరేలాల్ భోజనముచేసి తాంబూలము వేసుకొనుచుండెను: ఆయనభార్య జీతంయావత్తూ ఖర్చుఅయిపోయెగదా వ్రజనాథ్ గారిసొమ్ము యెట్లుతీర్చెదరు అని ప్రశ్నించెను. ఇప్పుడేమితొందర! రేపు శలవుపై పోవుచున్నాము. వచ్చేసరికి మూడునెలలు రమారమీ అగును. అప్పటిమాట చూచుకోవచ్చును. అని జబాబుచెప్పెను. ఆమాటలు వ్రజనాథునకు వజ్రపుపోటులవలె తగిలెను. ఎవరో ముఖముపై చెంపకాయ వేసినట్లు కళ్లుజిగేల్మనెను. వరండానుండిదిగి నిరాశ, కోపము జుట్టుకొని యింటికి ధ్యానములేకుండా చేరుకొనెను.

౪

వ్రజనాథునకు రాత్రి నిద్రపట్టలేదు. ఒకప్పుడు గోరేలాల్ ధూర్తతనమునకును, ఇంకొకప్పుడు తన అమాయకత్వమునకును కోపము తెచ్చుకొనుచుండెను. ఆహా! యేబీదవారిధనమో కదా! ఈసొమ్ము విషయమై వారు యెట్టియిబ్బంది పడుచున్నారో! అయినను దీనిగురించి యిప్పుడు కోపించినగాని విచారించినగాని లాభములేదు. భామమొదటే యివ్వవద్దనిపోరినది. జీతంలో సొమ్ము మిగల్చవలెనంటె ఖర్చులకు సమముగా సరిపోవుచున్నది. ఏదైనా కఠినపరిశ్రమచేసి వొక్కమాసములో ఈసొమ్ము పూర్తిచేయవలెను. కోర్టుకాగితములు తెచ్చి రాత్రిళ్లు తర్జుమాచేసి రోజుకిరూపాయి సంపాదించినను నెలనాటికి గోరేలాల్కుయిచ్చిన సొమ్ము పూర్తికాగలదు. అని నిశ్చయించి పగలు తనమామూలుపనులు చూచుకొంటూ, రాత్రి పన్నెండుఒంటిగంటవరకూ కాగితములు తర్జుమాచేయుచుండెను. భామ యీశ్రమచూచి సహించలేక "మీరు ఇంతగా కష్టపడిన మీశరీరమునకు జబ్బుప్రవేశించును. చాలా బాధపడిపోతారు. మీకు సొమ్ముఅవసరమైనయడల నావస్తువయేదైన తాకట్టువుంచి సొమ్ముసర్దుబాటు చేసుకొనుడు. వ్యవహారముపట్ల మొగమాటపడకూడదు. మీరు అప్పుడే నీరశించిపోయినారు అనెను. అప్పుయివ్వవద్దని భామచెప్పినను వినక గోరేలాల్కుయిచ్చి తిరిగి భామవస్తువతాకట్టుంచుట ఆయనకు అవమానకరముగాతోచెను. అందుచే ఎట్టిశ్రమలనైన తను పొందుటకు దృఢపర్చుకొనెను. ఇట్లు 25-దినములు శ్రమపడి రు 25 లు సంపాదించెను. యింక 5-దినములలో సొమ్ము పూర్తిచేయుదునుగదాయని సంతోషించుచుండెను. కాని తానొకటితలచిన దైవమొకటితలచునన్నట్లు 26-వ దినము సాయంకాలము యింటికిరాగానే చలితో ఉష్ణమువచ్చెను. రాత్రిభోజనము చేయలేనని భామతోచెప్పెను. మామూలుగా కాగితములు తర్జుమాచేయుటకు కూర్చొనెను కాని ఉష్ణతీవ్రము సహించలేక మంచముపై సాగిలబడెను. ఆవుష్ణము రెండుదినములవరకు వదలలేదు. వైద్యునకు కబురుపెట్టెను. వైద్యుడు మందులుయిచ్చుచుండెను. ఇంట్లో డబ్బు వదలిపోవుచుండెను. కాని జబ్బువదలలేదు ఈమాదిరి 20-దినములు గడచేసరికి డాక్టరుగారి బళ్లఅద్దెలక్రింద మందులఖర్చులక్రింద నూరురూపాయలు ఆయెను. వ్రజనాథ్ మంచముపై దీనదృష్టులతో నీరసముగా పడియుండెను. భామకు యేమియుదారితోచలేదు. దిగులుచెందుచుండెను. అయ్యో! యేబీదలధనము మనయింట్లోనుంచబట్టి వాళ్లవుసురు మనకు ఈవిధము

గాతగిలెనాయని భయపడుచుండెను. ఆపదలప్పుడు దైవముతప్ప దిక్కెవ్వరుతోచరు. చివరకు దుర్గామందిరమునకుపోయి ఆమెనుపూజించి తనభర్తకు నిమ్మళింపజేయుటకు శరణువేడ నిశ్చయించెను. ఆదినము ఉదయముననే పెనిమిటికి మందుయిచ్చి తనబిడ్డలనిద్దరిని వెంటనిడుకొని దుర్గామందిరమునకు జనెను. లోపల దేవిని జూచుటతోడనే ఆమెకు వకవిధమైన భయముజనించెను. కండ్లుమూసుకొని చేతులురెండుజోడించి "తల్లీ! మా అపరాధము క్షమించి నా పెనిమిటికి నిమ్మళింపజేయుము"అని దీనముగా వేడుకొనెను.

అంతట "పరాయధనము యిచ్చివేయుము నీకు సేమముచేకూరు"నన్నట్లు ఆమెచెవులకు వినబడెను. అంతలో వేరొకస్త్రీవచ్చి నిరాశతో శోకదేవతవలె, దేవిమూర్తికి ఎదురుగా నిలువబడి రెండుచేతులు జోడించి బిగ్గరగా "తల్లీ! నాధనము యెవరైతే దాచియుంచినారో వారికి సర్వనాశనముగావించుము. నేను, నాపిల్లలు మలమల మాడుచున్నాము"అని విలపించెను. ఆపలుకులు భామచెవులకు ములుకులవలె తగిలెను. దేవివైపు చూచేసరికి తీవ్రముగా "పరాయధనము దాచకుము. ఇచ్చివేయుము. లేనిచో నీకు సర్వనాశనము సంభవించును"అనుచున్నట్లు ప్రతిధ్వనించెను. భామలేచి నిలువబడి ఆస్త్రీతో అమ్మా మీసొమ్ము యెవరైనా తీసుగొన్నారా?

స్త్రీ:—ఆఁ. అవునమ్మా.

భామ:—యెన్నిరోజులక్రిందట.

స్త్రీ:—రమారమి నెలపదిహేనురోజులక్రిందట.

భామ:—యెన్నిరూపాయిలు?

స్త్రీ:—పూరా నూటయిరువై.

భామ:—యేలాగు పోయినవి?

స్త్రీ:—యెక్కడనో పొట్లముతో జారిపడిపోయెను. నాభర్త పటాలములో సిఫాయిగా పనిజేసి పరలోకప్రాప్తింజెందెను. యేడాదికి అరవైరూపాయిలు "పెన్షన్" మాకువొరుకుచున్నది. రెండేళ్ల "పించను" వక్కమారు దొరికినది. ఖజానాలో గిన్నీకాసులు యెనిమిదియిచ్చిరి. అవి పొట్లముచుట్టి మొలను పెట్టుకొంటిని. ఎచ్చట జారెనో తెలియదు.

భామ:—నీ పొట్లము నీకు దొరికిన నాకేమి యిచ్చెదవు!

స్త్రీ:—లావుయియ్యలేను. ఇరవై రూపాయిలు యిచ్చెదను.

భామ:—రూపాయిలు యేమిచేసుకొనెదను? అంతకంటె విలువైన పదార్థముయిమ్ము.

స్త్రీ:—నాజన్మవున్నంతకాలము మీ పేరు పొగడుకొంటాను.

భామ:—నాభర్త జబ్బుతోనున్నారు. ఆయనకు నిమ్మళముగానుండుటకు ఆశీర్వదించుము.

స్త్రీ:—ఆయనకు నాసొమ్ము దొరికినదాయేమి?

భామ:—హాఁ. ఆరోజు మొదలు మీకొరకు ఆయనవెదకుచునే యున్నారు.

ఆ స్త్రీ సంతోషముతో కూర్చొని కొంగుచాపి, దేవిని "మాతా! ఈమెకు కళ్యాణప్రాప్తిచేయుము" "అని ప్రార్థించెను. అప్పుడు భామ దేవివైపు చూచేసరికి కరుణదృష్టితో "నీవు యింటికిపొమ్ము. నీకు శుభమగును" అనునట్లుతోచెను.

౬

ఒకనాటి సాయంకాలము వ్రజనాధు, అతనిభార్య టాంగాపై పూర్వపరిచితురాలగు ఆస్త్రీ యింటికి ప్రయాణమైపోయిరి. సొమ్ము చాలావరకు మందులక్రిందను డాక్టర్లఫీజులక్రిందను వ్యయమైపోయెను. గోశే

లాలుకుయిచ్చిన రెండుగిన్నీ కాసులసొమ్ము పూర్తిచేయుటకుతోచక విచారించుచుండెను. అది భామచూచి తన కమ్మలజత అమ్మివేశి ఆసొమ్ము పూర్తిచేయుటకు భర్తను ప్రోత్సహించెను. కమ్మలజతను విక్రయించి మొత్తము పూర్తిజేసిరి. ఆవస్తువు చేయించిననాడైనా ఆమె అంత సంతోషపడలేదు. ఎనిమిదిగిన్నీ కాసులు తులశమ్మ (ఆస్త్రీపేరు)కుయిచ్చివేశి విలంబమునకు క్షమింపప్రార్థించిరి. ఆమెఉభయులను మనస్ఫూర్తిగా ఆశీర్వదించెను. శలవుగైకొని గృహోన్ముఖులైరి. వ్రజనాధు యింటికిచేరి వాలుకుర్చీపై విశ్రమించెను. ఇంతలో గోరేలాల్ తనస్నేహితుని చూచుటకువచ్చెను. వ్రజనాధ్ ఆయననుచూచి మొగముత్రిప్పుకొనెను.

గోరేలాల్:—సోదరా! మీశరీరములో ఎట్లున్నది.?

వ్రజనాధ్:—ఇప్పుడు నింపాదిగాఉన్నది.

గోరేలాల్:—నన్నుక్షమింప ప్రార్థన. మీసొమ్ము వాపసుచేయుటకు ఇంతఆలశ్యముచేశినందుకు మిక్కిలి సిగ్గుపడుచున్నాను. కారణము. ఆరోజునే యింటివద్దనుండి అర్జంటుగారమ్మనమని వుత్తరమువచ్చినది. తమతో చెప్పుటకు టైములేకపోయినది. ఇప్పటివరకూ ఆచిక్కులనుండి తేలలేకపోతిని. ఇదిగో తమ సొమ్ము తెచ్చితిని.

పై శాంతవచనములు వ్రజనాధు కోపముచల్లార్చెను. చాలాజబ్బుపడ్డానని యు,ప్రస్తుతం తెరిపిగానున్నదనియు చెప్పెను నాసొమ్మువిషయమై సద్దుకొనుటకు మీరు కష్టపడియుండవచ్చును. తమకు అవకాశములేనిచో ఇంకొకప్పుడు యియ్యవచ్చును అని స్నేహభావముచూపెను. గోరేలాల్ వందనములుచేసి శలవుతీసుకొనెను. రూపాయిలు పట్టుకొని లోనికిపోయి వ్రజనాధ్, భామతో చెప్పెను "గోరేలాల్ యిదిగో రూపాయలు యిచ్చివేసెను."

భామ:—ఆరూపాయిలు మనవికావు. తులశమ్మవి. పరాయధనము దాచినందువల్ల బుద్ధివచ్చినది.

వ్రజనాధ్:—తులశమ్మసొమ్ము పూర్తిగా జెల్లించితిమే!

భామ:—యిచ్చివేస్తేమాత్రము! ఇదిఆమె ఆశీర్వాదఫలితము.

వ్రజనాధ్:—అయితే నీకమ్మలజతమాటయేమి!

భామ:—కమ్మలజత జెవులకుఅక్కరలేదు. దేవిపలుకులు కలకాలము చెవులలోనుండి పోయినవి.

—అనువాదము.

పుత్ర ప్రేమ

తాయి శేషగిరిరావుగారు

వీరు డోకడర్జునునికుమారునివలె
నాలమొనరించి రణసీమ నంతరించె
అతనిదేహమునీక్షించి యతనిభార్య
కడిదివగచేత కన్నీరు గార్పకుండె.
ఆమెనీక్షించి చేడియలంద రప్పు
డేడ్వకుండిన నక్కాంత యీల్గుననుచు
నామెనెట్లున నేడుచు నటులజేయ
గట్టియత్నంబుసలిపిరి పట్టుదలను.
తొలుత నావీరుగుణగణంబులనుజెలులు
పొగడజొచ్చిరి కాని యామగువమాత్ర
మొక్కసారియు మాటాడకుండె నకట!
కదలకుండెను స్వర్ణవిగ్రహమువోలె
అంత మరియొకనెలజాణ యచటజేరి
ప్రబలవీరుని మోముపై బట్టదీసె
ఎంతజేసిన నక్కాంత ఏమ్పులేక
కదలకుండెను స్వర్ణవిగ్రహమువోలె.
ముసలిదాదియొకతె వానిపుత్రుదెచ్చి
యామెపాదంబులందుంచునంత నామె
కన్నుగవ నశ్రుకణములు గార్పజొచ్చె
"మనెద తనయుడ! నీకొర" కనుచునేడ్చె.